క్లుప్తంగా

దాహార్తి తీర్చటం సామాజిక బాధ్యత



కంకిపాడు: దాహార్తి తీర్చటం సామాజిక బాధ్యత అని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. కంకిపాడు లాకురోడ్డులో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని మంత్రి జోగి రమేష్ మంగళవారం ప్రారంభించారు. పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వ యంత్రాంగంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి సామాజిక సేవలో భాగస్వాములు కావాలన్నారు. అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, ఎంపీటీసీలు చిట్టూరి ప్రసాద్, కోనా కిషోర్, నాయకులు తంబా బత్తుల ఓంకారం, బాకీ ఏడుకొండలు, అబ్దుల్లా, వీరంకి అయ్యన్నబాబు, మల్లు, కరిముల్లా, బీహెచ్ నాగిరెడ్డి, ఏ.రవి పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు



పెనమలూరు: ఎన్నికల సమయంలో మద్యం అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ ఏఎస్పీ ఏ.అవులయ్య హెచ్చరించారు. పెనమలూరు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో మంగళవారం పోలీస్, రెవెన్యూ, ఎక్సైజ్ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో మద్యం సరఫరాపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. మద్యం దుకాణాలు కూడా నిర్ణీత సమయాల్లోనే తెరవాలని ఆదేశించారు. తహసీల్దార్ ప్రసాద్, పెనమలూరు సీఐ టీవీవీ రామారావు, కంకిపాడు సీఐ శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



కంకిపాడు: దివ్యాంగులపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం ప్రాజెక్టు ఆఫీసర్ డాక్టర్ హిమబిందు అన్నారు. కంకిపాడులోని భవిత కేంద్రంలో ప్రపంచ ఆటిజం దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. చిన్నారులకు పండ్లు, మిఠాయిలు పంపిణీ చేశారు. దివ్యాంగులకు చేయూత అందిస్తే విజయాలను సాధిస్తారన్నారు. ఎంపీపీ పాఠశాల హెచ్ఎం సాంబశివరావు, ఐఈ రీసోర్సు టీచర్లు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

దాడి ఘటనపై కేసు నమోదు

పెనమలూరు: ఇద్దరు వ్యక్తులపై కర్రలతో దాడి చేసిన ముగ్గురిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అమలాపురం దేవరలంకకు చెందిన రాజ్‌కుమార్ హైదరాబాద్‌లో కబోర్డ్‌ల పని చేస్తాడు. అతని వద్ద అదే గ్రామానికి చెందిన ఓలేటి సతీష్ పని చేసేవాడు. అయితే సతీష్ పని మానివేసి విజయవాడకు వచ్చి రాజ్‌కుమార్ పట్ల చెడుగా ప్రచారం చేయసాగాడు. ఈ విషయం తెలిసిన రాజ్‌కుమార్ ఫోన్‌లో సతీష్‌ను అడుగగా నా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతా చేతనైతే విజయవాడకు వచ్చి మాట్లాడమని అన్నాడు. దీంతో రాజ్‌కుమార్ మంగళగిరి వద్ద ఉన్న మిత్రుడు నరసింహస్వామి వద్దకు వచ్చాడు. ఇద్దరు కలిసి కానూరులో ఉన్న సతీష్ వద్దకు వచ్చారు. రాజ్‌కుమార్ సతీష్‌ను కలిసి ప్రశ్నించటంతో సతీష్, సిద్ధూ, సాయి కర్రలతో రాజ్‌కుమార్, నరసింహస్వామిపై దాడి చేశారు. ఈ ఘటనలో గాయపడిన రాజ్‌కుమార్, నరసింహస్వామిలను విజయవాడ జీజీహెచ్‌లో చికిత్సకు చేర్చారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

భక్తులకు అన్నదానం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: స్థానిక ప్రసిద్ధ అభయాంజనేయ స్వామి దేవస్థానంలో మంగళవారం విశేష పూజలు, అన్నదానం నిర్వహించారు. 200 మంది భక్తులకు కాపల్లి రాఘవరాజు అన్న ప్రసాద వితరణ చేశారు. ఈఓ కూచిపూడి శ్రీనివాస్ పర్యవేక్షించారు.

విద్యకు అత్యధిక ప్రాధాన్యం

- నాడు–నేడుతో రూపుమారిన పాఠశాలలు
- కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ బడులు
- సమకూరిన మౌలిక వసతులు
- విద్యార్థుల్లో ఆసక్తి పెరిగేలా బోధన



కంకిపాడు ఆదర్శ పాఠశాల

కంకిపాడు: విరిగిపోయిన బెంచీలు.. కూలేందుకు సిద్ధంగా ఉన్న గోడలు.. పెచ్చులూడిన శ్లాబులు.. అత్యవసర సమయంలో ఇబ్బందులు.. ఇవీ.. ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల పరిస్థితి. కానీ నేడు ఆ పరిస్థితి పూర్తిగా మారింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను పూర్తిగా మార్చేసింది. విద్యకు అత్యధిక ప్రాధాన్యం కల్పించింది. విద్యార్థులు ఆసక్తిగా విద్యాబుద్ధులు నేర్చుకునేలా అవసరమైన మౌలిక వసతులను అమర్చింది. కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలను సిద్ధం చేసింది. నాడు–నేడు కార్యక్రమం కింద పెనమలూరు నియోజకవర్గంలో మొదటి దశ పనులు పూర్తి కాగా, రెండో దశ అభివృద్ధి పనులు సాగుతున్నాయి.

మొదటి విడతలో రూ.9.12 కోట్లతో పనులు

నియోజకవర్గంలో పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో 114 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల్లో ప్రాధాన్యతా క్రమంలో తొలి దశలో రూ.9.12 కోట్లను ప్రభుత్వం నాడు – నేడు కింద విడుదల చేసింది. ఎంపిక చేసిన పాఠశాలల అభివృద్ధి, మరమ్మతులు, తాగునీటి వసతుల కల్పన, క్రీడా పరికరాల ఏర్పాటు, మరుగుదొడ్ల నిర్మాణం, వంట గదులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. ఆకర్షణీయమైన రంగులతో, ఆహ్లాదకరమైన వాతావరణం పాఠశాలలో నెలకొనేలా, పాఠశాలకు రావాలంటే విద్యార్థులకు ఆసక్తి పెరిగేలా చర్యలు తీసుకుంది. అత్యధికంగా కంకిపాడు మండలంలో 28 పాఠశాలలకు రూ.5.57 కోట్లు వెచ్చించి వసతులను కల్పించింది.

రెండో విడతకు రూ.16.01 కోట్లు విడుదల

తొలి దశ పూర్తయిన క్రమంలో రెండో దశ కింద నియోజకవర్గ వ్యాప్తంగా పాఠశాలలను ప్రభుత్వం ఎంపిక చేసింది. రివాల్వింగ్ ఫండ్‌గా రూ.5.64 కోట్లు విడుదల చేయగా, రూ.4.75 కోట్లతో పనులు కూడా చురుగ్గా సాగుతున్నాయి. ఈ నిధులతో తాగునీటి వసతుల కల్పన రూ.27.5 లక్షలతో, మరుగుదొడ్లకు రూ.20 లక్షలు, రంగులకు రూ.3 లక్షలు, ఫర్నీచర్‌కు రూ.57 లక్షలు వెచ్చించారు.

తరగతులు ప్రారంభించే ముందే సామగ్రి

గతంలో ఉన్న పరిస్థితి మారిపోయి ప్రస్తుతం కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ బడులు సిద్ధమయ్యాయి. విద్యార్థులకు తరగతులు ప్రారంభించే ముందే అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫామ్, బ్యాగు, విద్యా సామగ్రిని అందిస్తోంది. మధ్యాహ్నం వేళ జగనన్న గోరుముద్ద కింద రుచికరమైన భోజనాన్ని అందిస్తూ, విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గోరుముద్దకు 12,640 మందికి రూ.12.52 కోట్లు, ఎనిమిదో తరగతి విద్యార్థులు 1,828 మందికి రూ.2.41 కోట్లతో ట్యాబ్‌లను, విద్యా కానుక కింద 12,461 మందికి రూ.8.84 కోట్లు వెచ్చించి చదువులకు అవసరమైన విద్యా సామగ్రి, పుస్తకాలను అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న డీఈఓ తాహెరాసుల్తానా, ఉపాధ్యాయులు(ఫైల్)

విద్యకు పెద్ద పీట..



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చదువులకు ఎంతో ప్రాధాన్యం కల్పించింది. విద్యార్థులు పోటీ ప్రపంచంతో రాణించేలా ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టింది. నూతన విద్యా సంస్కరణలతో చదువుల పట్ల విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. గతంతో పోలిస్తే విద్యా ప్రమాణాలు పెరిగాయి. పిల్లల్లో పఠనాశక్తి పెరిగింది. భవిష్యత్తు తరాలకు ఇచ్చే నిజమైన ఆస్తి చదువే.

– బీహెచ్ నరేష్ రెడ్డి, స్థానికుడు, కుందేరు

అన్ని వసతులు ఉంటున్నాయి



ఒకప్పుడు ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు ఉండేవి కాదు. కానీ ప్రభుత్వ హయాంలో పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించారు. తరగతి గదులు కట్టారు. మంచి భోజనం పెడుతున్నారు. కార్పొరేట్ పాఠశాలలకు ఏ మాత్రం తీసిపోని విధంగా స్కూళ్లు సిద్ధమయ్యాయి. విద్యార్థులు కూడా యూనిఫామ్, కాళ్లకు షూతో హుందా పాఠశాలలకు వెళ్తున్నారు. ఇదీ నిజమైన అభివృద్ధి.

– మల్లు, స్థానికుడు, కంకిపాడు

రూ.204.57 కోట్లు అమ్మ ఒడి

పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన చిన్నారులు చదువులకు దూరం కాకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అమ్మ ఒడి పథకాన్ని అమలుచేసింది. ఈ పథకం కింద నియోజకవర్గం వ్యాప్తంగా ఇప్పటి వరకూ 63,153 మందికి రూ.204.57 కోట్లు లబ్ధి చేకూరింది. చదువులకు ఆటంకం లేకుండా తల్లిదండ్రులు ఆ సొమ్మును విద్యార్థుల ఉజ్వల భవితకు వినియోగిస్తున్నారు.

ఎన్నికల నిబంధనలు పటిష్టంగా అమలు చేయాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ జాహ్నవి

విజయవాడరూరల్: ఎన్నికల సంఘం నిబంధనలను బూత్‌స్థాయి అధికారులు పటిష్టంగా అమలు చేయాలని విజయవాడ రూరల్ మండల తహసీల్దార్, అదనపు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి.జాహ్నవి ఆదేశించారు. రూరల్ మండల తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బూత్ స్థాయి అధికారులకు పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌పై మంగళవారం శిక్షణ కార్యక్రమం జరిగింది.

దరఖాస్తులు అందజేయాలి..

ఈ సందర్భంగా తహసీల్దార్ జాహ్నవి మాట్లాడుతూ.. అంగవైకల్యం, దీర్ఘకాల వ్యాధితో బాధపడుతూ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటుహక్కు వినియోగించుకోలేని వారికి, 85 వయస్సు పైబడి పోలింగ్ కేంద్రానికి రాలేని వారికి ఎన్నికల సంఘం ఇంటి వద్దనే ఓటుహక్కు వినియోగించే అవకాశాన్ని కల్పించిందన్నారు. అలాంటి వారు ముందుగా 12డి ఫామ్ దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. దీనిపై సెక్టార్ అధికారి, బూత్‌స్థాయి అధికారి దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి విచారించాలన్నారు. పారామిలటరీ సిబ్బందికి, ఎన్నికల విధులను నిర్వహించే వివిధ ప్రభుత్వ శాఖల ఉద్యోగులకు, జర్నలిస్టులకు పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పించబడిందని వారికి కూడా ఈ విషయాన్ని తెలియజేసి వారికి పోస్టల్ బ్యాలెట్‌లను అందజేయాలన్నారు. ఉంగుటూరు మండల తహసీల్దార్ జె.వి.సుబ్బారావు పాల్గొని బూత్‌స్థాయి అధికారులకు అవగాహన కల్పించారు.

కూటమికి ఘోర ఓటమి తప్పదు

- గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్
- ప్రసాదంపాడులో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు వివరించిన వంశీ
- రాష్ట్ర భవిష్యత్ కోసం రెండు ఓట్లు ఫ్యాన్‌కు వేయాలని అభ్యర్థన



ప్రసాదంపాడులో వంశీమోహన్‌ను గజమాలతో సత్కరిస్తున్న ప్రజలు, నాయకులు



మహిళలకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న వంశీమోహన్

రామవరప్పాడు: ప్రజా మద్దతును కూడకట్టుకున్న సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోలేక టీడీపీ తోక పార్టీలు ఏకమై చౌకబారు రాజకీయాలకు పాల్పడుతున్నాయని, ఈ కూటమికి ఘోర ఓటమి తప్పదని వైఎస్సార్ సీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ వల్లభనేని వంశీమోహన్ స్పష్టం చేశారు. విజయవాడ రూరల్ మండలంలో గత నాలుగు రోజులుగా జరుగుతున్న వల్లభనేని వంశీమోహన్ ఎన్నికల ప్రచారం మంగళవారం ప్రసాదంపాడులో ఎంతో అట్టహాసంగా జరిగింది. ఈ సందర్భంగా గొల్లపూడి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు ఆధ్వర్యంలో వంశీమోహన్‌ను యాదవుల బజారులో గజమాలతో సత్కరించి అపూర్వ స్వాగతం పలికారు. ఉదయం 7 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకూ జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో వంశీమోహన్‌కు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. దారి పొడవునా పూలు వెదజల్లుతూ, బాణసంచా కాలుస్తూ కార్యకర్తలు, అభిమానులు, నాయకులు ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సీఎంగా మళ్లీ జగనన్న, హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా వంశీమోహన్ తప్పకుండా విజయం సాధిస్తారని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. వీధి వీధిన వంశీకి మహిళలు హారతులిచ్చి విజయ తిలకం దిద్దారు. ప్రతి ఇంటికి వెళ్లిన వంశీ.. అవ్వా, తాత, అక్క, అన్న అంటూ ఆప్యాయంగా పలకరించి సంక్షేమ పథకాల అమలు గురించి తెలుసుకున్నారు. సొంతింటి కల నెరవేరిందని, పిల్లలకు అమ్మ ఒడి డబ్బులు వచ్చాయని, రైతు భరోసాతో మేలు చేకూరిందని, చేయూత, ఆసరా డబ్బులు జగనన్న వేశారని, పింఛను వస్తుందని మహిళలు, వృద్ధులు, ప్రజలు వంశీమోహన్‌కు ఎంతో సంతోషంగా చెప్పారు.

చంద్రబాబు సిగ్గుపడాలి..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తుంటే చూసి ఓర్వలేక చంద్రబాబు, పవన్‌కల్యాణ్ అడ్డంకులు సృష్టిస్తున్నారని వంశీమోహన్ మండిపడ్డారు. పండుటాకులకు ఒకటో తేదీన పింఛన్ అందకుండా చేసి చంద్రబాబు రాక్షస ఆనందం పొందుతున్నాడన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన చిరునవ్వుతో వేకువజామునే తలుపుతట్టి అవ్వా, తాతలకు పింఛను అందించే వలంటీర్లపై విషం కక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వయస్సులో చిన్నవాడైన జగన్ సంక్షేమ పాలనను చూసి 40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉన్న చంద్రబాబు సిగ్గుపడాలన్నారు. ఎవరెన్ని కుట్రలు చేసిన వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు తమ విలువైన రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి పెత్తందార్లను తరిమి తరిమి కొడతారన్నారు. కార్యక్రమంలో గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మా కోటేశ్వరరావు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, జెడ్పీటీసీ సువర్ణరాజు, గన్నవరం ఎలక్షన్ ఇన్‌చార్జి ఆర్.వెంకటేశ్వరరావు, కోనేరు సుబ్బారావు, వైఎస్సార్ సీపీ రూరల్ మండల అధ్యక్షుడు శీలం రంగారావు, రామవరప్పాడు సర్పంచ్ వరి శ్రీదేవి, మాజీ ఉప సర్పంచ్ కమల్‌రాజు, సొసైటీ చైర్మన్ వెంకటేశ్వరరావు, రవికుమార్, నియోజకవర్గ నాయకులు, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మళ్లీ సీఎం జగనన్న పరిపాలనకే పట్టం

వంశీమోహన్ మాట్లాడుతూ.. రాష్ట్ర భవిష్యత్, సంక్షేమ పథకాలు కొనసాగింపు కోసం రాష్ట్ర ప్రజలు సీఎం జగనన్నకే మళ్లీ పట్టం కట్టడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందన్నారు. ఒక వైపు పెత్తందార్లు, మరో వైపు ప్రజా నాయకుడు జగన్‌కు మధ్య జరగబోయే ఎన్నికల కురుక్షేత్రంలో తమ తమ విలువైన ఓట్లు ద్వారా కూటమిని తరిమికొట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. గత టీడీపీ పాలనలో అణిచివేతకు గురైన పేద, బడుగు, బలహీన వర్గాలు నేడు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో తలేత్తుకుని గౌరవంగా జీవిస్తున్నారని చెప్పారు. వృద్ధులకు పింఛను కావాలన్నా, విద్యార్థులకు ఉన్నత చదువుకు అవసరమయ్యే సర్టిఫికెట్లు కావాలన్న, ప్రభుత్వంతో ఏ చిన్న పని వచ్చిన కాళ్లు ఆరిగేలా తిరిగిన రోజులు ప్రజలు ఎన్నటికి మరిచిపోలేదన్నారు.

పేదలను చంద్రబాబు ఇబ్బందులు పెడుతున్నాడు

- పింఛన్ అందకుండా అడ్డుపడింది టీడీపీనే
- కంకిపాడు ఇంటింటి ప్రచారంలో మంత్రి జోగి రమేష్



కంకిపాడులో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి జోగి రమేష్

కంకిపాడు: పేదలకు పింఛను అందకుండా ఇబ్బందులకు గురిచేసిన నీచుడు, దుర్మార్గుడు చంద్రబాబే అని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేష్ అన్నారు. మండల కేంద్రమైన కంకిపాడులో ఇంటింటి ప్రచారం మంగళవారం నిర్వహించారు. లాకురోడ్డు ప్రాంతంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పలువురు పింఛన్ లబ్ధిదారులు తమకు పింఛను అందలేదని, వలంటీర్లు రాలేదని మంత్రి జోగి రమేష్ ముందు వాపోయారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా వలంటీర్లు పనిచేశారన్నారు. సంక్షేమాన్ని ఇంటికే చేర్చారన్నారు. ప్రజలు సంతోషంగా ఉండటాన్ని చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని మండిపడ్డారు. సంక్షేమాన్ని అడ్డుకునేందుకు చంద్రబాబే కుట్ర పన్నాడని ఆరోపించారు. ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయించటంతో వలంటీర్లను విధులకు దూరం పెట్టారని, అందువల్లే పింఛన్లు అందలేదన్నారు.

టీడీపీ నేతలను చొక్కా పట్టుకుని నిలేయండి

పింఛన్లను సచివాలయాల వద్ద పంపిణీ చేసేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారని మంత్రి జోగి రమేష్ చెప్పారు. చంద్రబాబు దుర్మార్గుడు అని, ఓట్లు కోసం వచ్చే టీడీపీ నేతలను చొక్కా పట్టుకుని నిలదీయాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. అర్హులందరికీ పథకాలను చేరువ చేసి, ప్రజల సంతోషానికి కారణమైందని చెప్పారు. ప్రతిపక్షాలు అన్నీ ఏకమై వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్రపన్నుతున్నాయని విమర్శించారు. సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ వైఎస్సార్ సీపీ అధికారంలోకి రావాలని, సీఎంగా మళ్లీ జగనన్నే కావాలని పిలుపునిచ్చారు. విపక్షాల కుట్రలను ఓటు అనే ఆయుధంతో తిప్పికొట్టాలని కోరారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి విజయాన్ని అందించాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బాకీ బాబు, ఏఎంసీ వైస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, జేసీఎస్ చైర్మన్ రాచూరి చిరంజీవి, సర్పంచ్‌లు బాకీ రమణ, వీరంకి వెంకటరమణ, మేరుగు విజయ చంద్రశేఖర్, ఎంపీటీసీలు చిట్టూరి ప్రసాద్, కోనా కిషోర్, వడుగు శ్రీనివాసరావు, బూరగ బాలాజీ, తోకల ఉమాదేవి, కమ్మ, ఉమెన్ ఫైనాన్స్, టిడ్కో కార్పొరేషన్ డైరెక్టర్లు రామినేని రమాదేవి, నందిపాటి బిందుమాధవి, పి.రాఘవరావు, సీహెచ్‌సీ చైర్మన్ మేదండ్రావు కుటుంబరావు, ఏఎంసీ డైరెక్టర్లు జొన్నలగడ్డ నాగేశ్వరరావు, మరియబాబు, అగ్రిబోర్డు చైర్మన్ చాట్ల విజయ్‌బాబు, మాజీ ఎంపీపీ మాదు శ్రీహరిరాణి, నాయకులు తంబాబత్తుల ఓంకారం, బొడ్డు రాజశేఖర్, కాగిత రాజా రమేష్, కొండవీటి సుబ్బారావు, గుడ్డేటి రాజా, కలపాల వజ్రాలు, తొడుసు శ్రీను, బి.నాగిరెడ్డి, లాం సురేష్, చుండూరు మోహన్‌రావు, జోజిమేరీ తదితరులు పాల్గొన్నారు.

వరకట్నం వేధింపులపై కేసుల నమోదు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటి వారిపై పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం వణుకూరు గ్రామం పడమటిచెరువు ప్రాంతానికి చెందిన నామాల వీణ 2022వ సంవత్సరంలో తెనాలికి చెందిన అంబటి మదన్‌ను పెద్దల సమక్షంలో కట్నకానుకలు ఇచ్చి వివాహం చేసుకుంది. భర్త టింబర్ వ్యాపారం చేస్తాడని, హైదరాబాద్‌లో కూడా వ్యాపారం ఉందని తెలిపారు. వీణ బీటెక్, ఎంబీఏ చదివింది. పెళ్లి జరిగిన కొద్ది రోజులకు హైదరాబాద్‌లో కాపురం పెట్టారు. కొద్ది రోజుల కాపురం సాఫీగానే జరిగింది. అయితే ఆ తరువాత అదనపు కట్నం కావాలని భర్తతో పాటు అత్త అంబటి వెంకటరమణమ్మ, ఆడపడుచు భాగ్యాలు, లీల వేధింపులకు గురి చేయటంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. దీంతో అత్తింటి వారిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

యనమలకుదురులో..

పెనమలూరు: యనమలకుదురులో వరకట్నం కోసం వేధించిన అత్తింటి వారిపై మంగళవారం కేసు నమోదు చేశామని పెనమలూరు సీఐ టీవీవీ రామారావు తెలిపారు. యనమలకుదురు ఇందిరా నగర్‌కు చెందన కొప్పనాతి లత పెనమలూరుకు చెందిన కొప్పనాతి రాజేష్‌ను 2022వ సంవత్సరంలో పెద్దల సమక్షంలో వివాహం చేసుకుంది. పెళ్లి సమయంలో కట్నకానుకలు ఇచ్చారు. భర్త ప్రైవేటు కంపెనీలో ఉన్నత ఉద్యోగం అని తెలిపారు. అయితే పెళ్లి జరిగిన తరువాత నుంచి భర్తతో పాటు అత్త, మామలు చాముండేశ్వరి, వెంకటేశ్వరరావు, ఆడపడుచులు పీతకరుణకుమారి, మైలవరపు జ్యోతి ఆమె భర్త రాకేష్, బంధువులు లోకేష్, శివలు అదనపు కట్నం కోసం వేధించసాగారు. భర్తకు సరైన ఉద్యోగం కూడా లేదని తెలిసింది. పెద్ద మనుషులు ఇరు కుటుంబాల మధ్య రాజీ చేసినా అదనపు కట్నం కావాలని అత్తింటి వారు డిమాండ్ చేశారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేయటంతో కేసు నమోదు చేశారు.

విద్యార్థులను ప్రోత్సహించేందుకే ప్రేరణ ఉత్సవాలు



ప్రేరణ పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ రవికుమార్

గన్నవరం: ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించేందుకు వికసిత్ భారత్ స్ఫూర్తితో ప్రేరణ ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు మండల విద్యా శాఖాధికారి కె.రవికుమార్ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి ప్రేరణ ఉత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పోటీ పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలను ఆయన పర్యవేక్షించారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ.. ప్రేరణ పరీక్షల ద్వారా పాఠశాల స్థాయిలో 20 మందికి వ్యాసరచన, పద్య పఠనం, డ్రాయింగ్ పోటీలను నిర్వహించామన్నారు. వీరిలో ప్రతిభ కనబరిచిన ప్రతి పాఠశాల నుంచి ఒక్కో బాలుడు, బాలికకు మండల స్థాయిలో పోటీలు జరిపామని తెలిపారు. మండల స్థాయిలో ఎంపికైన బాలుడు, బాలికను జిల్లా స్థాయి ప్రేరణ ఉత్సవాలకు నామినేట్ చేస్తామన్నారు. జిల్లా స్థాయిలో ప్రేరణ పరీక్షను బాపులపాడు మండలం వేలేరులోని జవహర్ నవోదయ విద్యాలయంలో నిర్వహించామన్నారు. విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రేరణ ఉత్సవాలు దోహదపడతాయని చెప్పారు. ఎంఈఓ–2 కమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలి



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న సీఐ పెద్దిరాజు

గన్నవరం: ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రత నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటించాలని ట్రాఫిక్ సీఐ వాసా పెద్దిరాజు సూచించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద మంగళవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ.. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను అనుమతించరాదన్నారు. ఆటోలను రద్దీ ప్రాంతాల్లో కాకుండా నిర్ణీత ప్రదేశాల్లో మాత్రమే నిలుపుకోవాలని సూచించారు. లైసెన్స్ లేకుండా డ్రైవర్లు ఆటోలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పరిమితికి మించిన వేగంతో ఆటోలను నడపడం ప్రమాదకరమని తెలిపారు. ప్రమాదాల నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ట్రాఫిక్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం కోడూరుపాడులో జరిగిన అగ్ని ప్రమాదంలో పూరిల్లు దగ్ధమైంది. గ్రామంలోని చింతపల్లి లక్ష్మికి చెందిన తాటాకుల ఇంటి పైకప్పుపై మంగళవారం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో స్థానికులు మంటలు అదుపు చేసేందుకు యత్నించారు. సమాచారం అందుకున్న హనుమాన్‌జంక్షన్ అగ్నిమాపక కేంద్రం సిబ్బంది హుటాహుటిన సంఘటనాస్థలికి చేరుకుని మంటలు అదుపు చేశారు. కాగా, విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించినట్లు ఫైర్ సిబ్బంది ప్రాథమికంగా భావిస్తున్నారు. రూ.3 లక్షలు ఆస్తినష్టం జరిగినట్లు అధికారులు అంచనా వేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: రాంగ్ రూట్‌లో నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాన్ని నడుపుతూ ఓ వ్యక్తిని తీవ్రంగా గాయపర్చిన సంఘటనపై హనుమాన్‌జంక్షన్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. వీరవల్లికి చెందిన దేవరకొండ శివశంకర్ సోమవారం రాత్రి 10 గంటల సమీపంలో ద్విచక్ర వాహనంపై హనుమాన్‌జంక్షన్ వచ్చి తన ఇంటికి తిరిగి వెళ్తుండగా హెచ్ మార్ట్ సమీపంలో రాంగ్ రూట్‌లో అతి వేగంగా వచ్చిన బైక్ ఢీకొట్టింది. దీంతో శివశంకర్ తలకు బలమైన గాయాలయ్యాయి. 108 అంబులెన్స్‌లో పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాలకు చికిత్స నిమిత్తం తరలించారు. ఎస్ఐ జనార్దన్ కేసు నమోదు చేశారు.

పింఛన్ల పంపిణీకి సచివాలయాల్లో కౌంటర్ల ఏర్పాటు

పెనమలూరు/ఉంగుటూరు/గన్నవరం: నేటి నుంచి సామాజిక పింఛన్లు పంపిణీకి సచివాలయాల్లో ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేశామని ఎంపీడీఓలు కుమార్‌బాబు, మహేశ్వరరావు, సత్యకుమార్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి సచివాలయంలో ఐదు కౌంటర్లు చొప్పున ఏర్పాటు చేశామన్నారు. ఈ నెల 6వ తేదీ వరకు పింఛన్లు ఇస్తారన్నారు. బుధవారం సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు, మిగతా రోజుల్లో ఉదయం 7 నుంచి సాయంత్రం 7 గంటల వరకు పింఛన్లు పంపిణీ చేస్తారని చెప్పారు. అనారోగ్యంతో, వృద్ధాప్యంతో లేవలేని వారికి, దివ్యాంగులకు సచివాలయ సిబ్బంది ఇళ్లకు వెళ్లి పింఛన్లు అందజేస్తారని తెలిపారు.